సాక్షి సంగారెడ్డి

సోమవారం, 12, ఆగస్టు, 2024



అదిగో.. అల్లదిగో

దుబ్బాక వేంకటేశ్వర ఆలయం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వంగా సుందరంగా ముస్తాబైంది. వివరాలు 8లో ▸



గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

బీదర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను జహీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు 8లో ▸



రేషన్ బియ్యం పట్టివేత

అందోల్ మండల పరిధిలోని సంగుపేట శివారులో రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

స్వచ్ఛంద సంస్థ చేయూత



పాఠశాలను పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పట్టణంలోని మూడు ఉన్నత పాఠశాలల్లో హైదరాబాద్‌లోని బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా క్రమశిక్షణ, ఆరోగ్యం, నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ, కంప్యూటర్ విద్య అంశాలపై రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి సంస్థ చైర్మన్ కృష్ణ పార్‌శెట్టిని ఒప్పించామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం సంస్థ ప్రతినిధులైన వాలేరో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇండియా ఆపరేటింగ్ హెడ్ ఫణికుమార్ సింహాద్రి, మార్కెటింగ్ మేనేజర్ కార్తీక్ కోరుకొండ, వంశీలతో కలిసి ఎమ్మెల్యే ఖేడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 50 మందికి ఒక కంప్యూటర్, ల్యాబ్‌లు, ఇంటర్నెట్ తదితర సదుపాయాలు ఏర్పాటుచేసి నిపుణులైన సంస్థ వలంటీర్లతో విద్యార్థులకు రెండునెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంఈఓ విశ్వనాథ్, నాయకులు అవుటిశంకర్, గుండేరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న జిల్లాస్థాయి సెలక్షన్స్

కొండాపూర్(సంగారెడ్డి): యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లాస్థాయి యోగా సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డుతో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియానికి ఉదయం 10 గంటలకు వరకు రావాలని పేర్కొన్నారు. 10 నుంచి 14 ఏళ్లు, 14 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికల విభాగంలో సెలక్షన్స్ ఉంటాయని, ఇక్కడ ఎంపికైనవారు రాష్ట్రస్థాయి యోగా పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 94413 82238, 96769 46771 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏఈఓల బదిలీ

మునిపల్లి(అందోల్): వ్యవసాయ విస్తరణాధికారులు బదిలీపై వెళ్లారు. ఆదివారం మండలంలోని కంకోల్‌లో ఇంతకుముందు పనిచేసిన ఏఈఓ లావణ్య పెద్దచల్మెడ వ్యవసాయ విస్తరణాధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. పెద్దచల్మెడలో ఏఈఓగా పని చేసిన రహీమాన్ మునిపల్లి రైతు వేదిక పరిధిలోని గ్రామాల్లో పని చేస్తారని మండల వ్యవసాయాధికారి శివకుమార్ తెలిపారు. అలాగే పటాన్‌చెరు మండల వ్యవసాయాధికారిగా వెళ్తున్నట్లు శివకుమార్ తెలిపారు. సదాశివపేటలో ఏఓగా పని చేసిన అనిత మునిపల్లి మండల ఏఓగా బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు.

13 వరకు డిగ్రీ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ ద్వారా జరిగే డిగ్రీ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల గడువును ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు తారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్న ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ ద్వారా తారా కళాశాలలో సీటు వచ్చి అడ్మిషన్ పొందనివారు ఈ నెల 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకొని, కళాశాలలో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. స్పెషల్ ఫేజ్‌లో సీటు వచ్చిన విద్యార్థులు ఒక సెట్ జీరాక్స్ కాపీలతో రెండు ఫోటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో అడ్మిషన్‌ను పొందాలన్నారు. ఇతర వివరాలకు 9441069020లో సంప్రదించాలన్నారు.

ఓటు హక్కు కల్పించండి

కొండాపూర్(సంగారెడ్డి): ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, ఈ విషయంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగారం శ్రీనివాస్, అనుముల రాంచందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలో వారు మాట్లాడుతూ.. అన్ని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి డీఈడీతో పాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలని, భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలని కోరారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను అందరినీ రెగ్యులర్ చేసి మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలను స్వాధీనం చేసుకొని 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. 317 జీఓలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు, పెండింగ్‌లో ఉన్న 13 జిల్లాల స్పౌజ్ కేటగిరీ ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డెంగీ పంజా



విజృంభిస్తున్న విష జ్వరాలు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో గతనెల నుంచి ఇప్పటివరకు 51 కేసులు
- దోమల నివారణకు అధికారుల చర్యలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

జిల్లాలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. వర్షాకాలం కావడంతో పారిశుధ్య నిర్వహణ లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలు ప్రబలి పల్లె, పట్నం అనే తేడా లేకుండా జనం మంచం పడుతున్నారు. ప్రధానంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, ఫైలేరియా బాధితులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. తాజాగా పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

– పటాన్‌చెరు టౌన్ :



పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వద్ద బారులుదీరిన రోగులు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీధుల్లో మురుగు చేరి దోమల వ్యాప్తి పెరుగుతుంది. దీంతో జనం దగ్గు, జలుబు, ఫ్లూతో పాటు డెంగీ జ్వరం బారిన పడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి ఓపీ జూన్ వరకు గరిష్టంగా 450 ఉండగా, గత నెల నుంచి 800కి పైగా నమోదుకావడం ఆందోళన కలిగిస్తుంది.

జూలై నుంచి ఇప్పటి వరకు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో 51 వరకు డెంగీ, టైఫాయిడ్ 67, డయేరియా 177 కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు. ఇవి ప్రభుత్వ ఆస్పత్రిలోని లెక్కలు మాత్రమే. ప్రైవేట్‌లో ఇంకా చాలామంది డెంగీ బాధితులు చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కానీ ఎవరికీ ప్రాణాపాయం కలగలేదని వైద్యులు చెబుతున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుండటంతో వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు

పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ కేసులు నమోదవుతుండటంతో ఇటీవల కలెక్టర్ కాంత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు వీధుల్లో యంత్రాలతో ఫాగింగ్ చేయిస్తున్నారు. అలాగే చెరువుల్లో ఆయిల్ బాల్స్ వదులుతున్నారు.

> **జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుంది**
>
> 
>
> డెంగీ వస్తే భయపడాల్సిన అవసరం లేదు. వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలి. బాధితులు అధికంగా కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ తీసుకోవాలి. దోమల విజృంభించకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
>
> – శ్రీనివాస్ రెడ్డి, పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్



చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ల సూచనలు

- ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలి.
- పిల్లలకు విరేచనాలు అయితే.. ఓఆర్ఎస్, జింక్ తదితర పదార్థాలను అందిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- 2 నెలల నుంచి ఆరు నెలల చిన్నారులకు తల్లి పాలలో కలిపి జింక్ అర ట్యాబ్లెట్ లేదా సిరప్(10 మి.గ్రా)ఇవ్వాలి.
- ఆరు నెలలు ఆపై వయసున్న పిల్లలకు ఒక జింక్ ట్యాబ్లెట్ లేదా సిరప్(20 మి.గ్రా) శుభ్రమైన నీటిలో కానీ తల్లి పాలల్లో కలిపి అందించాలి.



కసాన్‌పల్లిలోని తాగునీటి ట్యాంకు వద్ద నిలిచిన మురుగు

ఇదేనా స్వచ్ఛదనం?

- తూతూమంత్రంగా స్వచ్ఛదనం, పచ్చదనం
- పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- కంపుకొడుతున్న డ్రైనేజీలు
- విజృంభిస్తున్న దోమలు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

పట్టణాలు, పల్లెలు పరిశుభ్రతతో ఉండాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం 'స్వచ్ఛదనం, పచ్చదనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ చాలా మండలాలు, గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో పల్లెలు పారిశుద్ధ్య లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో దోమలు విజృంభించి జనం మంచం పడుతున్నారు.

– వట్‌పల్లి(అందోల్):

అందోల్ మండలంలోని కసాన్‌పల్లి, రాంసాన్‌పల్లిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వర్షాకాలం ప్రారంభమై సుమారు రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు ఈ గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి, వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు రోగాల బారినపడుతున్నారు.

అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకులు

గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఎక్కువ రోజు నీరు నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెందే ప్రమాదముందని తెలిసినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, నాలాల్లో బ్లీచింగ్ చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రివేళ కంటి కునుకు లేక ఇబ్బంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర విష జ్వరాలు వచ్చి మంచం పడుతున్నారు. దీంతో జ్వరపీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతు న్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టుకుమార్



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న శ్రీధర్, రవికుమార్

పటాన్‌చెరు టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు కుమార్ అన్నారు. తలసేమియా వ్యాధి బాధిత చిన్నారుల కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, టీఎండీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపటి రవికుమార్ మాట్లాడారు. తలసేమియా వ్యాధి బాధిత చిన్నారులకు 15 రోజులకు ఒకసారి రక్తాన్ని మార్పిడి చేయాలన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉండే రోగులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తదాతలు ప్రాణదాతలుగా మారుతున్నారన్నారు. ఇలాంటి శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. బాపు వెంకన్న, మహేశ్, జ్యోతి, శ్రీనివాస్, అన్వర్ సాబ్, వేణుగోపాల్, అరవింద్, సాయితేజ పాల్గొన్నారు.

బస్వరాజ్‌కు విద్యా మహర్షి అవార్డు



అవార్డు అందుకున్న టీచర్ బస్వరాజ్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మహీంద్ర కాలనీ ఆనంద్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొబ్బిలిగామ బస్వరాజ్‌కు ఆదివారం హైదరాబాద్ లలితకళా సమాఖ్య(సేవా సామాజిక సంస్థ)వారు విద్యా మహర్షి అవార్డును ప్రదానం చేశారు. మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఈయన విద్యాభివృద్ధికి చేసిన కృషికి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. లలితకళా సమాఖ్య 30వ సువర్ణ కంకణ అవార్డుల కార్యక్రమాన్ని సికింద్రాబాద్‌లోని ఆర్‌పీ రోడ్డులో ఉన్న కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బస్వరాజ్‌ను ఘనంగా సన్మానించి నిర్వాహకులు వెంకటేశ్వర్ ప్రశంసా పత్రం, జ్ఞాపిక, కంకణం అందించారు.

నేడు జహీరాబాద్ బంద్‌కు పిలుపు

జహీరాబాద్: బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈనెల 12వ తేదీన జహీరాబాద్ బంద్‌కు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. మహిళలపై అత్యాచారాలు, అకృత్యాలు, చిత్ర హింసలకు గురిచేసి చంపడం, ఆస్తులపై దాడులు, విద్యాసంస్థల విధ్వంసం జరుగుతున్నా అక్కడి ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయా సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బంద్‌కు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు.

తులసీరాం రాథోడ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న తులసీరాం రాథోడ్

జహీరాబాద్ టౌన్: సామాజిక సేవకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తులసీరాం రాథోడ్‌కు పాండిచ్చేరిలోని పీస్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. మండలంలోని మల్‌చెల్మ తండాకు చెందిన తులసీరాం రాథోడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబెస్)ను ఏర్పాటు చేసి ముప్పై ఏళ్లుగా సెలవురోజుల్లో జాగోబంజారా అనే చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తోటి ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి గిరిజన తండాల్లో సదస్సులు ఏర్పాటు చేస్తూ విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. తులసీరాం రాథోడ్ సేవలను గుర్తించి పాండిచ్చేరి పీస్ యూనివర్సిటీ శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరేట్‌ను కన్నడ సినీ దర్శకుడు అశ్వత్థామ చేతుల మీదుగా అవార్డును అందించారు.

వలంటీర్లను నియమించాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

జహీరాబాద్: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలో తపస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల అనంతరం అనేక పాఠశాలల్లో వారి కొరత ఏర్పడిందన్నారు. దీంతో ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు నష్టపోకుండా ఉండాలంటే వలంటీర్లను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లాలో కలెక్టర్ చొరవ తీసుకుని వలంటీర్ల నియామకానికి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోనూ నియామకాలు చేపట్టాలన్నారు. సమావేశంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప, నాయకులు తుకారాం, తుక్కప్ప, శ్రీపాల్, మొగులయ్య, రాములు, శ్రీకాంత్, రాజునాయక్, శ్రీరామ్, వెంకటేశ్వర్‌రెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని భూ సమస్యలు పరిష్కరించి రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం కొండాపూర్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణాలు మాఫీలో రైతులకు బ్రోకర్ల బెడద లేకుండా చూడాలని, అసైన్డ్ భూములకు పట్టాలు, కొత్త పాస్ పుస్తకాలు వెంటనే ఇవ్వాలని కోరారు. పేదలందరికీ డబుల్ బెడ్ రూంలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నర్సింహులు, మండల కార్యదర్శి రాజయ్య, బాబురావు, మైపాల్ రెడ్డి, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొండపోచమ్మలోకి గోదావరి పరవళ్లు

మర్కూక్(గజ్వేల్): కొండపోచమ్మ సాగర్‌లోకి గోదావరి పరవళ్లు తొక్కుతున్నాయి. ప్రాజెక్టులోకి గోదావరి జలాలను వదులుతుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వేసవికాలంలో కేవలం 2 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండటంతో పంట కాలువల్లో సాగు నీరు పారలేదు. నాలుగు రోజులుగా నీరు విడుదల చేస్తుండటంతో ప్రస్తుతం 4.6 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు చెబుతున్నారు. కాల్వల ద్వారా సైతం నీటిని పారిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రంగనాయక సాగరం.. సిద్దిపేటకు వరం

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గ రైతాంగానికి రంగనాయక సాగర్ గొప్ప వరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్‌ను ఆదివారం సందర్శించారు. రిజర్వాయర్‌లోకి పంపింగ్ అవుతున్న గోదావరి జలదృశ్యాన్ని చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతల ఆనందం.. వారి ముఖాల్లో చిరునవ్వు.. చేసే పనికి సార్థకత లభిస్తుందన్నారు. ప్రస్తుతం రంగనాయక సాగర్‌లో 2.3 టీఎంసీలు ఉన్నాయని, 3 టీఎంసీల నిటిని నింపాలని అధికారులను ఆదేశించారు. కాలువల ద్వారా వెంటనే చెరువులు, కుంటలు నింపాలని సూచించారు. కాలువల ద్వారా ఇబ్బందులు వస్తే పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



రంగనాయక సాగర్‌లోని జలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్‌కు గౌడ సేన జాతీయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ పాపన్న గౌడ్ జాతీయ పురస్కారాన్ని అధ్యక్షుడు ఏడుకొండలు చేతుల మీదుగా అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు డ్రాప్ అవుట్ పిల్లలను బడుల్లో చేర్పిస్తున్నందున ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జాతీయ పురస్కారం పొందిన శ్రీనివాస్‌ను తోటి ఉపాధ్యాయులు, మండల ప్రజలు అభినందించారు.

మేరాజ్ ఫాతిమాకు డాక్టరేట్

సిద్దిపేట ఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మేరాజ్ ఫాతిమా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. లాండోల్ఫియ పంక్టటాలో ఉన్న 'ఫైటో కెమికల్ ఫార్మకోలాజికల్ స్క్రీనింగ్ యాంటీ క్యాన్సర్ యాక్టివిటీ'పై పరిశోధనకు గాను తనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత పర్యవేక్షణలో చేసిన పరిశోధనలో క్యాన్సర్‌ను నయం చేయడానికి డాక్వీడ్ మొక్కలో మూడు సమ్మేళనాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఈఓ డాక్టర్ గోపాల సుదర్శనం, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాణి తదితరులు ఫాతిమాను అభినందించారు. డాక్టరేట్‌కు సహకరించిన గైడ్ ప్రొఫెసర్ సుజాత, సిద్దిపేట ఫుట్‌బాల్ కోచ్ అక్బర్‌నవాబ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత



లారీతో నిందితులు

జహీరాబాద్ టౌన్: కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణం నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న నిషేధిత గుట్కాను జహీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ కాశీనాథ్ కథనం మేరకు.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్లు ఆస్రుత్‌అలీ(34), బాబులాల్(22)లతో పాటు కర్ణాటకకు చెందిన జయప్రకాశ్ లారీలో అక్రమంగా బీదర్ నుంచి హైదరాబాద్ వైపు గుట్కాను తరలిస్తున్నారు. ఆదివారం జహీరాబాద్ పోలీసులు బైపాస్ రోడ్డులోని అల్గోల్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానం వచ్చి లారీని తనిఖీలు చేయగా నిషేధిత గుట్కా ప్యాకెట్లు బయటపడ్డాయి. లారీలో సాగర్, ఎస్ఆర్ 1 కంపెనీకి చెందిన 100 బ్యాగ్‌ల్లో గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి. వీటి విలువ రూ. 45 లక్షల వరకు ఉంటుందని, గుట్కా ప్యాకెట్లతోపాటు లారీని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

చెక్ డ్యామ్‌లో నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్న పేట (మెదక్): ఏడుపాయల చెక్ డ్యాంలో నీట మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా బుదేరాకు చెందిన చాకలి గోపాల్(44) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాయనమ్మ చనిపోవడంతో నిద్ర చేయడం కోసం శనివారం ఏడుపాయలకు వచ్చారు. ఆదివారం ఉదయం స్నానం చేసేందుకు చెక్ డ్యాం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి పోయాడు. కుటుంబీకులు గమనించి స్థానికుల సాయంతో చెక్ డ్యామ్‌లో గాలించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి కుమారుడు వివేకానంద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అదిగో.. అల్లదిగో

- బ్రహ్మోత్సవాలకు దుబ్బాక బాలాజీ ఆలయం ముస్తాబు
- తెలంగాణ తిరుపతిగా, గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి
- రేపటి నుంచి 18 వరకు ఉత్సవాలు
- హాజరుకానున్న చినజీయర్‌స్వామి, మాజీ సీఎం కేసీఆర్, ప్రజాప్రతినిధులు
- 4 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా

ఆపద మొక్కుల వాడ.. అనాథ రక్షక గోవింద..గోవింద.. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి దుబ్బాకలో కొలువుదీరి మూడేళ్లవుతుంది. ఈ సందర్భంగా ఆలయం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వంగా సుందరంగా ముస్తాబైంది. దుబ్బాక పట్టణంలో అత్యంత అద్భుతంగా నిర్మించిన బాలాజీ ఆలయం అనతి కాలంలోనే తెలంగాణ తిరుపతిగా.. భక్తుల కోరికలు తీర్చే గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచింది. రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన లక్ష్మీ సహిత వెంకటేశ్వర ఆలయం బ్రహోత్మవాలు 13వ తేదీ (మంగళవారం) నుంచి 18 వరకు ఘనంగా జరుగనున్నాయి. ఇందుకుగాను ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– దుబ్బాక



బాలాజీ ఆలయం ముఖద్వారం



దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఆలయం

అనతికాలంలోనే దుబ్బాక బాలాజీ ఆలయం తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందడం విశేషం. 2009 నవంబర్ 1న దుబ్బాకలో బాలాజీ ఆలయం నిర్మాణానికి శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి భూమి పూజ చేశారు. రూ.10 కోట్లకు పైగా దాతల విరాళాలు, 12 ఏళ్లపాటు మాజీ సీఎం కేసీఆర్, చినజీయర్‌స్వామిల ప్రత్యేక పర్యవేక్షణలో పట్టణంలో 2 ఎకరాల స్థలంలో టీటీడీ ప్లానింగ్, వాస్తు ప్రకారం ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అద్భుతంగా ఆలయం రూపుదిద్దుకుంది. ఆలయం నిర్మాణ ట్రస్టులో మాజీ సీఎం కేసీఆర్‌తో కలిసి చదువుకున్న వారే ఎక్కువ ఉండడంతో తరచుగా ఆలయం నిర్మాణం పనులు వివరిస్తూ వచ్చారు. 2015లో దుబ్బాకకు వచ్చిన కేసీఆర్ అరగంటకు పైగా బాలాజీ ఆలయం నిర్మాణ పనులు సందర్శించి వెంటనే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (దేవదాయ శాఖ) నుంచి రూ.3 కోట్లు మంజూరి చేయించడంతోపాటు రూ.1.25 కోట్లు కామన్ గుడ్ ఫండ్(సీజీఎఫ్) కింద మంజూరి చేయించి ఆలయ నిర్మాణానికి కృషి చేశారు.

4 లక్షలకు పైగా భక్తులు రాక

బ్రహ్మోత్సవాలకు సుమారుగా 4 లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. దుబ్బాక, సిద్దిపేట జిల్లాలో నుంచే కాకుండా హైదరాబాద్‌తో పాటు తెలంగాణ నలుమూలల నుంచి రానున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, హరీశ్‌రావుతోపాటు పలువురు మంత్రులు ప్రముఖులు హాజరు కానున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

13వ తేదీ (మంగళవారం) నుంచి 18 వరకు ఆరు రోజులపాటు వేంకటేశ్వర స్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. మొదటి రోజు పుణ్యాహవచనం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ఆరంభం అవుతాయి. 14న ఆలయంలో కలశారాధన, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, 15న నిత్య హోమం, సుహాసినులతో కుంకుమార్చన, సాయంత్రం రాయబారం, ఎదుర్కోళ్ల ఉత్సవం, 16న ఉదయం 10 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, సాయంత్రం కలియుగ దైవం వేంకటేశ్వస్వామి కల్యాణోత్సవం శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో జరుగనున్నాయి. 17న నిత్యహోమం, రథోత్సవం, 18న మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఆకట్టుకుంటున్న విగ్రహాలు..



ఆలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి

బాలాజీ ఆలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మీ సహిత వెంకటేశ్వర విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 60 అడుగుల ఎత్తైన రాజగోపురం, మొదటి అంతస్తులో బాలాజీ స్వామి వారి విగ్రహం, కుడివైపు పద్మావతి ఆలయం, ఎడమ వైపు గోదాదేవి ఆలయాలను నిర్మించారు. ఆలయంలో విశ్వక్సేనుడు, పంచముఖ ఆంజనేయ స్వామి, గరత్మంతుడు ఉపాలయాలను సైతం నిర్మించారు. కింది భాగంలో ధ్యాన మండపం, ఆలయం వెనుకాలో ప్రవచనాలకు కళావేదిక, ఎడమ వైపున నక్షత వనం, రాశి వనం, సరస్వతీ వనం, కుడివైపు పేద తీరడానికి ఉద్యానవనం, పిల్లలకు కృష్ణ వనం పేరుతో పార్కును ఏర్పాటు చేశారు. స్వామి వారి దర్శనంకు వచ్చే వృద్ధులకు లిఫ్ట్ సౌకర్యం, 500 మంది సామర్థంతో భోజనశాలను నిర్మించారు.

అందరి సహకారంతో నిర్మాణం



అత్యంత అద్భుతంగా నిర్మించిన లక్ష్మీసహిత బాలాజీ ఆలయం అనతి కాలంలోనే తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచింది. ఆలయం నిర్మాణానికి సీఎం కేసీఆర్, చినజీయర్ స్వామి, ఆలయం శాశ్వత అధ్యక్షుడు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తో పాటు ఆలయ ట్రస్టు బాధ్యులు, దాతలు సహకారం అందించారు. మూడేళ్లు అవుతున్న సందర్భంగా తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– వడ్లకొండ శ్రీధర్, బాలాజీ ఆలయం ట్రస్టు అధ్యక్షుడు

ఏర్పాట్లు పూర్తి



ఆలయం నిర్మాణంలో మాజీ సీఎం కేసీఆర్ కృషి మరువలేనిది. ఆలయం నిర్మాణంలో పాలు పంచుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఆలయం తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు భారీగా భక్తులు హాజరుకానున్నారు. చినజీయర్ స్వామితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానుండడంతో అన్ని ఏర్పాట్లు చేశాం.

– రొట్టె రాజమౌళి, కేసీఆర్ మిత్రుడు, ఆలయ ట్రస్టు ముఖ్య బాధ్యుడు

రూ.18 వేల వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేటకమాన్: ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షను రద్దు చేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ ఏం.పద్మ, మంజుల, ప్రవీణ, భాగ్యలక్ష్మీ, సంతోష, లక్ష్మీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపునకు వెళ్లొస్తానని..

యువతి అదృశ్యం



నవీన

వర్గల్(గజ్వేల్): యువతి అదృశ్యమైన ఘటన వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. అవుసులోనిపల్లికి చెందిన మోతె నవీన(19) శనివారం మధ్యాహ్నం మెడికల్ షాపునకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల వద్ద, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం యువతి తండ్రి లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పట్టుబడ్డ ఐదుగురు, పరారీలో ఒకరు



చిన్నకోడూరులో పట్టుబడ్డ వారితో పోలీసులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రం శివారులోని శేరుపల్లి వద్ద పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరుపల్లి శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి ఆరుగురిని గుర్తించాం. ఇందులో చౌడారం గ్రామానికి చెందిన పెండ్యాల రాజు, కొరవేణి రాజు, సికింద్లాపూర్‌కు చెందిన పిట్టల లింగం, మేడిపల్లికి చెందిన దండ్ల రాజు, సిద్దిపేటకు చెందిన పుల్లూరి రామాచారి పట్టుబడ్డారు. మేడిపల్లికి చెందిన గొల్లెల ప్రశాంత్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి రూ.16,800 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 5 బైకులు స్వాధీనం చేసుకున్నారు. చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి గుర్తించిన వారు వెంటనే 87126 67445 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

నేరడిగుంటలో ఆరుగురు అరెస్ట్

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు జోగిపేట ఎస్‌ఐ పాండు తెలిపారు. గ్రామానికి చెందిన పట్లోళ్ల మల్లప్ప ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పేకాట అడుతున్న వినోద్‌కుమార్, సంగమేశ్వర్, శివశంకర్, మల్లేశ్, రాజయ్య, మల్లప్ప లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.1,800 నగదుతోపాటు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ మృతి చెందిన ఘటన ములుగు మండలం బండమైలారం సమీపంలో చోటు చేసుకుంది. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మేడ్చెల్‌లోని వెంకట్రాంరెడ్డి కాలనీకి చెందిన గగనం ప్రేమ్(24) సోమారం గ్రామంలోని మెడిప్లస్ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం తన పల్సర్ బైక్‌పై కంపెనీకి వెళ్లాడు. అదే రోజు రాత్రి కొత్తూరు గ్రామంలోని తన స్నేహితుడి ఇంటికి వెళ్తుండగా బండమైలారం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రేమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గగనం రామచందర్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వృద్ధుడు



యాదయ్య(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన శివ్వంపేట మండలం అల్లీపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. అల్లీపూర్ గ్రామానికి చెందిన రైతు నిమ్మల యాదయ్య(68) ఆదివారం ఉదయం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. బావిచుట్టూ గడ్డిని శుభ్రం చేస్తుండగా జారి బావిలో పడటంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

146 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన బియ్యంతో పోలీసులు

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్న ఘటన అందోలు మండలం పరిధిలోని సంగుపేట శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి డీసీఎం వ్యానులో డెగ్లూర్ ప్రాంతానికి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు డీటీసీఎస్ హేమంత్ కుమార్, పోలీసు కానిస్టేబుల్ వేణుగోపాల్ వాహనాల తనిఖీ నిర్వహించి డీసీఎంను పట్టుకున్నారు. 146 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంను జోగిపేట సివిల్ సప్లయ్ గోడౌన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వాహన డ్రైవర్ జాకీర్, యజమాని సతీష్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కొల్లూరు ఎస్‌ఐ రమేశ్ కథనం మేరకు.. కొల్లూరు రింగ్‌రోడ్డు ఎగ్జిట్–2 వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించాం. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉంది. అతడి కుడి చేతిపై రవితేజ, ఎడమ చేతిపై రద అని తెలుగులో టాటోలు ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే కొల్లూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భార్యపై హత్యాయత్నం

పోలీసుల అదుపులో భర్త



బాధితురాలిని పరామర్శిస్తున్న ఏసీపీ మధు, సీఐ లక్ష్మీబాబు

సిద్దిపేటకమాన్: భార్యపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించిన భర్తను సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో నీలం సరిత, రాజు దంపతులు నివాసం ఉంటున్నారు. భార్యపై లేని పోని అనుమానం పెట్టుకొని రాజు శనివారం రాత్రి గ్రానైట్ రాయితో దాడి చేసి గాయపర్చాడు. గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలించారు. భార్యపై హత్యాయత్నానికి పాల్పడినందున రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరితను ఏసీపీ మధు, సీఐ లక్ష్మీబాబు, ఎస్‌ఐ నర్సింహారావు పరామర్శించి గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

పింఛన్ డబ్బులు, బంగారం కోసమే హత్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రేణుక

- వృద్ధురాలిని చంపిన కేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ రేణుక

టేక్మాల్(మెదక్): పింఛన్ డబ్బులు, బంగారం కోసమే వృద్ధుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అల్లాదుర్గం సీఐ రేణుక కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం వెల్లడించారు. టేక్మాల్ మండలం కాదులూరు గ్రామ శివారులో దత్తాత్రేయ ఆశ్రమంలో గ్రామానికి చెందిన ఓబలి అంజమ్మ (70) కొంతకాలంగా ఒంటరిగా నివాసం ఉంటుంది. 7వ తేదీన రాత్రి ఆశ్రమంలోని గుడిసెలో ఉన్న వృద్ధురాలిని అదే గ్రామానికి చెందిన శివకుమార్ హత్య చేసి పరారయ్యాడు. మృతురాలి అల్లుడు వేముల రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడు శివ కుమార్‌ను జోగిపేటలో అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు. వృద్ధురాలి వద్ద ఉండే పెన్షన్ డబ్బులు, బంగారం దొంగలించేందుకు ప్రయత్నించానని, తనను చూసి కేకలు వేయగా ముక్కు, నోరు మూసి, గొంతు నొక్కడంతో చనిపోయిందని చెప్పాడు. 10 బంగారు గుండ్లు, ఒక పుస్తె తీసుకొని పారిపోయినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసును ఛేదించడంలో భాగస్వాములైన టేక్మాల్ పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. ఇందులో పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్, టేక్మాల్ ఏఎస్‌ఐ దయానంద్, సిబ్బంది ఉన్నారు.

గీత దాటితే వాతే..

మెదక్ పట్టణంలో కఠినంగా ట్రాఫిక్ రూల్స్

- అడ్డగోలుగా సిగ్నల్ జంప్‌లు, డ్రంకెన్ డ్రైవ్‌లు
- పెరుగుతున్న ప్రమాదాలు
- ప్రత్యేక చేపట్టిన చర్యలు పోలీసులు
- నంబర్ ప్లేట్ లేకుంటే వాహనం సీజ్



రెడ్ సిగ్నల్ పడినప్పటికీ రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారుడు



జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్

మెదక్ మున్సిపాలిటీ: గీతదాటితే తాట తీస్తామంటున్నారు మెదక్ పోలీసులు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా ఫైన్‌తో పాటు వాహనాలు సీజ్ చేయనున్నారు. సిగ్నల్ జంప్ చేయడం, ట్రిపుల్ రైడ్, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా పట్టణ కేంద్రంలో సిగ్నల్ జంప్‌లు అధికమయ్యాయి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఢీకొని వాహనదారులు గొడవలకు దిగుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. పెరుగుతున్న వాహనాల రద్దీ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

నిత్యం రద్దీ..

మెదక్ జిల్లా కేంద్రంలో రాందాస్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, ధ్యాన్‌చంద్ చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. పరిసర మండలాలు, గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పనిపై మెదక్ పట్టణానికి వస్తుంటారు. నిత్యం వేలాది వాహనాలు నడుస్తుండటంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. ఇదే సమయంలో కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక సమస్యలు తీవ్రమవుతుంది. దీని కోసం పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం, మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టిసారించారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

నంబర్ ప్లేట్ లేకుండా ఉన్న వాహనాల సీజ్‌పై జిల్లా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనం కనిపిస్తే స్టేషన్‌కు తరలించి ప్లేట్ వేయిస్తున్నారు. అయినా నిబంధనలు పాటించకపోవడంతో వాహనాన్ని సీజ్ చేస్తున్నారు. మరో వైపు ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంకె డ్రైవ్‌లపై విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. కొంతమంది వాహనదారులు తమ వాహనాల సైలెన్సర్ తొలగించి భారీ శబ్దాలతో నడిపిస్తుంటారు. అలాంటి వారిని సైతం పోలీసులు వదిలి పెట్టకుండా కఠిన చర్యలు చేపడుతున్నారు. శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న వారిపై భారీగా జరిమానాలు విధిస్తున్నారు.

ఇద్దరిని బలిగొన్న మైనర్లు

జిల్లా కేంద్రంలో ఇటీవల ముగ్గురు మైనర్లు నిర్లక్ష్యంగా కారు నడిపి ఇద్దరి ప్రాణాలు బలిగొన్నారు. ఈ ప్రమాదంలో ఒక పారిశుద్ధ్య కార్మికుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో బాలుడు ఆస్పత్రిలో పది రోజులు మృత్యువుతో పోరాడి ప్రాణాలు కోల్పోయాడు. మైనర్లు నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

నిబంధనలు పాటించాల్సిందే



వాహనదారులు ఎవరైనా సరే నిబంధనలు పాటించాల్సిందే. నిర్లక్ష్యంగా వ్యవహరించి సిగ్నల్స్ దాటినా.. డ్రంకెన్ డ్రైవ్ చేసినా వాహనాన్ని సీజ్ చేసి భారీగా జరిమానాలు విధిస్తాం. ప్రతీ వాహనానికి తప్పనిసరిగా అన్ని పత్రాలతోపాటు నంబర్ ప్లేట్ ఉండాలి. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపైనా కేసులు పెడుతాం. ఏదైన ప్రమాదం జరిగితే యజమానులే 14 ఏళ్లు జైలుకు వెళ్లాల్సి ఉంటుంది.

– నాగరాజు, సీఐ మెదక్